
రంజాన్ వేళలు
ఇఫ్తార్ - గురువారం సాయంత్రం - 6.33
సహర్ - శుక్రవారం ఉదయం - 4.57

పంట ఎండి.. రైతు గుండె మండి!

నీరందక ఎండుతున్న వరి చేలు » యాచారం మండలంలో 120 ఎకరాల్లో నష్టం

» పెట్టుబడికి వేలల్లో అప్పులు.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు


తమ్మలోనిగూడలో ఎండిపోయిన వరి చేను

యాచారం, మార్చి 20 : యాసంగిలో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అప్పులు చేసి వేసిన వరి చేను ఎండుతుండడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. బోర్లు ఎండిపోవడంతో యాచారం మండలంలోని పలు గ్రామాల్లో 120 ఎకరాల్లో వరి చేను ఎండింది. ఎనెకింది తండాలో చంద్రూనాయక్ రెండెకరాల్లో వరి వేశాడు. రూ.50వేల పెట్టుబడి పెట్టాడు. నీరందక చేను ఎండిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎండిన చేనులో పశువులను మేపుతున్నాడు. 20 రోజుల కిందటి వరకు బోరు నీరు బాగానే పోసినా ప్రస్తుతం ఎండిపోయింది. అలాగే తమ్మలోనిగూడలో దెంది రాంరెడ్డి మూడెకరాల్లో వరి వేయగా నీరందక ఎండిపోయింది. తాను రూ.75వేల పెట్టుబడి పెట్టానని, చేను ఎండి అప్పులపాలయ్యానని రాంరెడ్డి కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. ఇలా చాలా గ్రామాల్లో బోర్ల కింద వరి చేను ఎండుతోంది. గత 14ఏళ్లలో వరి చిరుపొట్ట దశలోనే ఎండిపోవడం ఇదే మొదటిసారని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడికి అప్పు చేశాను



రూ.50వేల పెట్టుబడితో వరి సాగు చేశాను. పంట ఎండిపోయింది. ఏం చేయాలో తోచక పశువులను మేపుతున్నా. పంట కోసం బంధువుల వద్ద అప్పు చేశాను. నీరందక మరో నాలుగు మడులు కూడా ఎండిపోయే పరిస్థితి ఉంది. గత కొన్నేళ్లలో ఇంత ముందుగా బోర్లు ఎండలేదు. పెట్టుబడి నష్టపోయిన మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. - చంద్రూనాయక్, రైతు, ఎనెకింది తండా


ఎనెకింది తండాలో నీరందక ఎండిన వరి చేను


ఎండిన వరి చేనులో మేస్తున్న పశువులు

మహేశ్వరంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

» చేవెళ్ల ఎంపీ స్థానంలో కాంగ్రెస్ విజయానికి కృషి

» ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి


వేం నరేందర్‌రెడ్డితో జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నాయకులు

మహేశ్వరం, మార్చి 20 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవడంతో పాటు చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలని సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సూచించారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి చెప్పారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరేలా చూడాలన్నారని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రజాపాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు క్యూ కడుతున్నారని, మహేశ్వరంలో కూడా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని నరేందర్‌రెడ్డి సూచించారన్నారు. కాంగ్రెస్‌లో చేరాలనుకునే ముఖ్య నాయకుల కోసం అవసరమైతే సీఎంతో మాట్లాడుతానని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు. సమావేశంలో బేర బాలకిషన్, అరవింద్‌కుమార్, మల్లేష్, సంతోష్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, సదానంద్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి ఉన్నారు.



క్యాంప్‌నకు వెళుతున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

క్యాంప్‌నకు తరలిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

కొత్తూర్, మార్చి 20: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు బుధవారం క్యాంప్‌నకు తరలివెళ్లారు. షాద్‌నగర్ నియోజకర్గంలోని కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను వారి వైపు తిప్పుకొని పార్టీలో చేర్చుకుంటుండడంతో బీఆర్‌ఎస్ నాయకులు అప్రమత్తమై ఆ పార్టీ ప్రజాప్రతినిధులను క్యాంప్‌నకు తరలించారు. క్యాంప్‌నకు తరలివెళ్లిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ జోలి రవీందర్, కౌన్సిలర్లు మాధవిగోపాల్, మాదారం నర్సింహాగౌడ్, కోస్గి శ్రీనివాస్, అనితాశ్రీనివాస్, సోమ్లనాయక్, యాదయ్య, ఎంపీటీసీ జంగన్నోళ్ల కృష్ణయ్య ఉన్నారు. కాగా ఈ నెల 28న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరిగే రోజు వారు తిరిగి వస్తారని సమాచారం.

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమైందని.. అసలు అభ్యర్థులెవరో కూడా నిర్ణయించలేని స్థితిలో అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్ పార్టీలు ఉన్నాయని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టిన ఆయన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి అన్నివర్గాల వారిని కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి వరుసగా మూడోసారి బరిలో దిగుతున్న ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలపై మాట్లాడారు. ప్రధాని మోదీనే మాకు బలం... ఆయన నిజాయితీని ప్రజలు నమ్ముతున్నారు... నన్ను కాదు దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రధాని మోదీని చూసి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఓటు బ్యాంకు రాజకీయాలను చేసే వారికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మాకు పోటీనే లేదని, ఎన్నికల్లో తాను 3లక్షల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్‌ఎస్ తమకు దారిదాపుల్లో కూడా లేవని.. అసలు వారి అభ్యర్థులు ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి క్యాండిడేట్లు దొరకక రూ.10వేల కోట్ల భూ దోపిడీ చేసిన వారిని అరువు తెచ్చుకుని పోటీ చేస్తుందని ఎద్దేవా చేశారు. తాను గెలిస్తే వికారాబాద్ దిశ, దశ మారుస్తానన్నారు. ఇంకా ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే....

ఆంధ్రజ్యోతితో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మా బలం మోదీనే!

» నాకు ప్రత్యర్థులే లేరు
» అధికార పార్టీకి క్యాండిడేట్లే దొరకడం లేదు
» రూ.10వేల కోట్ల కుంభకోణం చేసిన వారికి టికెట్లు
» కాంగ్రెస్ దుష్ప్రచారం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి
» కవిత అరెస్ట్‌తో కాంగ్రెస్ అసత్య ప్రచారానికి తెరపడింది
» నేను గెలిస్తే వికారాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
» వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకొస్తా

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీనే మాకు ప్రధాన ప్రచార అస్త్రం. ఆయనే మాకు బలం.. ఆయన నిజాయితీని దేశ ప్రజలు గుర్తించారు. ఆయనపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. మోదీ అంటేనే బీజేపీ... బీజేపీ అంటేనే మోదీ. అందుకే నన్ను కాదు మోదీని చూసి చేవెళ్లలో బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నాను. అదే కాంగ్రెస్ వాళ్లు రాహుల్‌గాంధీని చూసి ఓటు వేయాలని కోరగలుగుతారా? ఒక్క అభ్యర్థి కూడా రాహుల్ గాంధీపేరుతో ఓట్లు అడిగే ధైర్యం లేదు. ఇదే మా బలం... ఇదే కాంగ్రెస్ బలహీనత. ఇండియా కూటమి వారికే రాహుల్ గాంధీపై నమ్మకం లేదు. ఇంకా ఓట్లెలా అడుగుతారు. అసాధ్యమైన హామీలు ఇచ్చి తరువాత కాంగ్రెస్ మోసం చేస్తుంది. ఇపుడు రాష్ట్రంలో అదే జరుగుతుంది. దేశాన్ని ముందుకు తీసుకువెళ్లే విషయంలో మోదీకి స్పష్టమైన విధానం ఉంది. అందుకే మళ్లీ ఆయన ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. బీజేపీ పాలసీనే హిందుత్వ జాతీయవాదం. దేశానికి ఏం మంచిదో ఆయన అదే చేస్తున్నారు. అవినీతిని తగ్గించడమే కాక దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళుతున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు మేము చేయడం లేదు. అన్నివర్గాలు, అన్ని కులాలు, మతాల వారికి సమానంగా పథకాలు అమలు చేస్తున్నాం. ఇలాంటపుడు బీజేపీ మతతత్వ పార్టీ ఎలా అవుతుంది?. కరోనా వంటి గడ్డుకాలాన్ని కూడా అధిగమించి ప్రపంచంలో దేశాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకువెళ్లింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం. ఎకానమీలో దేశం 10వ స్థానం నుంచి 5వ స్థానానికి వచ్చిందంటే మోదీ తీసుకున్న నిర్ణయాలే కారణం. ప్రపంచంలో ఆర్థికంగా దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మోదీ ఎంతో కష్టపడుతున్నారు. ఆయన తీసుకున్న కొన్ని కఠిన నిర్ణయాల వల్ల ప్రభుత్వరంగ సంస్థలు, జాతీయ బ్యాంకులు ఇపుడు లాభాల దిశలో ముందుకు వెళుతున్నాయి. డిజిటల్ ఎకానమీ చేస్తామంటే కొందరు అప్పట్లో నవ్వారు. ఇపుడు దేశమంతా డిజిటల్ లావాదేవీలే జరుగుతున్నాయి. ఇపుడు దేశ ప్రజలు వాడే స్మార్ట్ ఫోన్లలో 70శాతం మనదేశంలోనే తయారవుతున్నాయి. మేకిన్ ఇండియా తరువాత రక్షణ రంగ పరికరాలను కూడా మనమే తయారు చేసుకుంటున్నాం. ఇతర దేశాలు కూడా మన మీదే ఆధారపడే పరిస్థితి ఇపుడు ఉంది. హిందువుల ఎన్నో సంవత్సరాల రామాలయ నిర్మాణ కలను మోదీ సాకారం చేశారు. ప్రభుత్వ నిధులు లేకుండానే అయోధ్యలో రామమందిరం కట్టించారు.

స్కీములన్నీ కేంద్రానివే

గ్రామీణ ప్రాంతాల్లో ఇపుడు అమలయ్యే అన్ని స్కీమ్‌లు దాదాపు కేంద్రానివే. రైతు వేదికలు, సబ్సిడీ ఎరువులు, బియ్యం సబ్సిడీ, సబ్సిడీపై ఎల్‌ఈడీ బల్బుల సరఫరా కేంద్రమే చేస్తుంది. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ కుటుంబ మీడియా ద్వారా ఇవన్నీ తామే చేసినట్లు చెప్పుకుని తప్పుడు ప్రచారం చేసుకుంది. ఇపుడిపుడే ప్రజలు వీటి గురించి తెలుసుకుంటున్నారు. కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తున్న పథకాల వల్లే తాము ఎక్కువ లబ్ధి పొందుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఓటు బ్యాంకు స్కీమ్‌లు కాకుండా ప్రజలకు పనికివచ్చే సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నాం. రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా పలు పథకాలు అమలు చేస్తున్నాం. యూరియాను 90శాతం సబ్సిడీతో అందజేస్తున్నాం. బీజేపీది ముమ్మాటికీ అంతోద్యయ సిద్ధాంతమే. కింది స్థాయి ప్రజలకు ఫలాలు అందాలన్నదే మా లక్ష్యం.

అధికార పార్టీకి అభ్యర్థే కరువు

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో మాకు పోటీనే లేదు. మేము 3లక్షల మెజార్టీతో గెలుస్తున్నాం. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్‌ఎస్ మా దరిదాపుల్లో కూడా లేవు. అసలు వారి అభ్యర్థులు ఎవరో కూడా తెలియడం లేదు. అధికార కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులే దొరకడం లేదు. ఎవరూ లేకపోవడంతో రూ.10వేల కోట్ల భూ దోపిడీ చేసిన వారిని అరువు తెచ్చుకుని పోటీ చేయడానికి సిద్ధమైంది. ధరణీ ముసుగులో రూ. వేల కోట్లు కొల్లగొట్టిన వారిని తీసుకువచ్చి పోటీ చేయిస్తున్నారు. డబ్బుతో రాజకీయాలను శాసించాలనుకుంటున్నారు. అది చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కుదరని పని. ఆ వ్యక్తి మా పార్టీలో చేరేందుకు కూడా ప్రయత్నించారు. అమిత్‌షాను కూడా కలిశారు. రూ.10వేల కోట్ల భూకుంభకోణాలు చేసిన వ్యక్తిని బీజేపీలో చేర్చుకుంటుందా? హన్మంతుడి గుడి కూల్చిన వ్యక్తి జై శ్రీరామ్ అని అనగలుగుతాడా? అందుకే ఆయనకు

మిగతా 7వ పేజీలో ...

రామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

» అన్నాసపల్లిలో సీతారాములు, శివపార్వతులు, సరస్వతీదేవిల విగ్రహాల ప్రతిష్ఠ
» ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి
» పాల్గొన్న ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి, యశస్వినీరెడ్డి, సుదర్శన్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 20 : మండలంలోని అన్నాసపల్లిలో రామేశ్వరవీరాంజనేయ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు, కౌన్సిల్ ఫర్‌గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ కొర్పోలు లీలాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా తొగుట గురు మాధనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద స్వామి, సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి ఎనుముల గీతారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, కల్వకుర్తి, బోధన్, పాలకుర్తి ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ప్రముఖ ఉపన్యాసకులు కసిరెడ్డి వెంకటర్‌రెడ్డి, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేదపండితులు మెళ్లూరి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వరకు వేడుకలు కొనసాగాయి. కార్యక్రమంలో పతంజలి ఆశ్రమం సాధ్వి నిర్మలానంద భారతి, జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, భరత్‌ప్రసాద్, నాయకులు/ప్రజాప్రతినిధులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బిక్యానాయక్, ఆనంద్, శంకర్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మమ్మ, అరవింద్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పద్మారెడ్డి, దిలీప్‌రెడ్డి, రవీందర్, ఆసిఫ్‌అలీ, సుధీర్‌రెడ్డి, స్వదీప్‌రెడ్డి, పాపిరెడ్డి, నవీన్‌రెడ్డి, నర్సింహ, బిచ్యానాయక్, జోగు వీరయ్య పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

దైవ కార్యక్రమాలు శాంతికి దోహదపడతాయని సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి అన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సుభిక్షంగా ఉండేలా భగవంతుడు అనుగ్రహించాలని కోరుకున్నట్లు చెప్పారు. పూజల అనంతరం ఆమె చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో మాట్లాడుతూ ప్రకృతి సహకరించి, దేవుడు అనుగ్రహించి సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతానికి తమ పెదనాన్న దివంగత సూదిని జైపాల్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని గీతారెడ్డి అన్నారు. ఎంపీ రాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలకు సాగునీరందించేలా సీఎం చొరవ తీసుకుంటున్నారని ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, యశస్వినిరెడ్డి అన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలే భారతీయుల వారసత్వం

దేశ సంస్కృతీ సంప్రదాయాలే మన వారసత్వ సంపద అని, వాటిని పరిరక్షించుకోవాలని మధవానంద సరస్వతి అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజశాంతి చేకూరుతుందన్నారు. దేవుడు ఎక్కడున్నాడో ప్రతీ మనిషి అనుభవానికొస్తేనే తెలుస్తుందన్నారు. సన్మామార్గంలో పయనించే వారికి దైవానుగ్రహం ప్రాప్తిస్తుందని స్వామిజీ అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం లీలాలక్ష్మారెడ్డి చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ అక్షరమే అంతరాలను తొలగిస్తుందన్నారు.


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీఎం సతీమణి గీతారెడ్డి


పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతి

బైర్ఖాన్‌పల్లిలో రథోత్సవం

కేశంపేట: బైర్ఖాన్‌పల్లిలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున రథోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో రథాన్ని ఊరేగించారు. లక్ష్మీనరసింహస్వామి నామస్మరణతో గ్రామం మర్మోగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రూప్లానాయక్, రాఘవేందర్‌రావు, శశివర్థన్‌రెడ్డి, యాదగిరిచారి, అంజయ్య, కుమార్, వెంకటేష్, హరిచందర్, గణేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



గడువు ముగిసిన తినుబండారాల పట్టివేత


పట్టుకున్న తినుబండారాలు

శంషాబాద్, మార్చి 20: గడువు ముగిసిన తినుబండారాలను విక్రయిస్తున్న ఓ కిరాణ షాపుపై శంషాబాద్ ఎస్వోటీ టీం దాడి చేసి పట్టుకున్నారు. ఎస్వోటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సాతంరాయిలో సైబుద్దీన్ అనే వ్యక్తి కిరాణషాపు నడుపుతున్నాడు. అతడు గడువుతీరిన తినుబండారాల ప్యాకెట్లను సేకరించి తక్కువ ధరకు అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారమందింది. దీంతో టీం సభ్యులు దాడి చేయగా కొన్ని వస్తువులు, తినుబండారాలు లభించాయి. ఆ వస్తువులను ఎక్కడి నుంచి సేకరించాడో ఆరా తీశారు. అమెజాన్, ఇతర ఆన్‌లైన్ సంస్థలు గడువు ముగిసిన తినుబండారాలు ప్యాకెట్లను డిస్‌మెటల్ చేసేందుకు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగిస్తారు. ఆలా పంపే వస్తువులను సైబుద్దీన్ సేకరించి తక్కువ రేటుకు విక్రయిస్తున్నాడని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద గడువు తీరిన తినుబండారాల ప్యాకెట్లను భారీగానే స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.41,870 ఉంటుందని తెలిపారు. దుకాణదారులు గడువుతీరిన తినుబండారాలను అమ్మొద్దని అధికారులు హెచ్చరించారు.



చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు!

ఇబ్రహీంపట్నం, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల కోడ్ దృష్ట్యా ఇబ్రహీంపట్నం పరిధిలో అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై మాల్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు, ఆగాపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టుల వద్ద బుధవారం సాయంత్రం ఆర్డీవో అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్నికల వరకు నిరంతరం ఈ తనిఖీలు నిర్వహిస్తామని ఏసీపీ తెలిపారు. డబ్బు, మద్యం లాంటివి అక్రమంగా తరలించకుండా నిఘా పెట్టామన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులపైనా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కులకచర్ల, మార్చి 20 : లేబర్ ఇన్సూరెన్స్‌ను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జన్ సాహస్ సంస్థ కులకచర్ల మండల కోఆర్డినేటర్ రవీంద ర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో రజక సంఘం జిల్లా కార్య దర్శి మోత్కూర్ వెంకటేశ్‌తో కలిసి కార్మికులకు లేబర్ కార్డులు పంపిణీ చే శారు. కార్డుపొందడంతో కార్మికుడి ఇంట్లో ఇద్దరు కూతుళ్లకు వివాహ కాను క కింద రూ.30వేలు, రెండు ప్రసవాలకు రూ.30వేల చొప్పున చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. సాధారణ మరణం జరిగితే రూ. లక్షా 30వేలు, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.6లక్షల 30వేలు ఇన్సూరె న్స్ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో భగత్, సాయికుమార్, సుశీల, రాధ, సునీత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్లు.. అగ్నికి ఆహుతి



బషీరాబాద్, మార్చి 20: పర్యవేక్షణ లేకపోవడంతో హరితహారం పథకంలో భా గంగా నాటి పెంచిన చెట్లు అ గ్నికి ఆహుతవుతున్నాయి. బషీరాబాద్-తాండూరు రోడ్డు మార్గంలో నాలుగైదేళ్లుగా 12 కిలోమీటర్ల మేర మొక్కలు నాటి సంరక్షిస్తు న్నారు. ఈ మార్గంలో పలుచోట్ల నాటిన మొక్కలు చెట్లుగా ఏపుగా పెరి గాయి. ఇటీవల రైతులు కొందరు తమ పంట పొలాల్లోని వ్యర్థాలను కాల్చే స్తుండటంతో మంటలు రోడ్డు వరకు వ్యాపించి చెట్లు దగ్ధమైపోతున్నాయి. ఈ మార్గంలో పలుచోట్ల అర కిలోమీటరు వరకు చెట్లు కాలిపోయాయి.

నీట మునిగి ఇద్దరు మృతి

» కుంటలో చేపల వల తట్టుకొని దుర్మరణం

» కొత్తూర్ మండలం గూడూర్‌లో ఘటన

కొత్తూర్, మార్చి 20 : కొత్తూర్ మండలం గూడూర్‌లో గల ఉప్పరోని కుంటలో చేపలవేటకు వెళ్లి ఇద్దరు మృతిచెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మక్తగూడకు చెందిన కిష్టయ్యగౌడ్(65), వడ్డె వెంకటేష్(40) ఇద్దరు మంగళవారం రాత్రి ఉప్పరోని కుంటలో చేపల వేటకు వెళ్లారు. చెరువులో వల వేసి ఇద్దరు చెరువులోకి దిగగా వల కాళ్లకు తట్టి నీట మునిగి మృతి చెందారు. బుధవారం ఉదయం కిష్టయ్యగౌడ్ మృతదేహం కుంటలో తేలింది. పశువుల కాపరి చూసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు కుంట వద్దకు చేరుకొని గాలించగా వలలో చిక్కుకొని వెంకటేష్ సైతం చనిపోయినట్టు గుర్తించి మృతదేహాన్ని వెలికి తీశారు. కిష్టయ్యగౌడ్, వెంకటేష్‌ల మృతితో కుంట వద్ద కుటుంబీకుల రోదనలతో మిన్నంటాయి. ఇద్దరు గ్రామస్తుల మృతితో మక్తగూడలో విషాదం అలుముకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ సీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనం

» 12 ఏళ్ల క్రితం శంకుస్థాపన.. ముందుకు సాగని పనులు


అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

కొడంగల్ రూరల్, మార్చి 20 : కొడంగల్ మండలంలోని నాగారం గ్రామంలో 12 ఏళ్ల క్రితం పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా పంచాయతీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. నాగారం గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు ప్రారంభించి స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. భవనం పూర్తి కాకపోవడంతో గ్రామంలోని మసీద్‌లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులు భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విదేశాల్లో ప్రతిభ చాటుతున్న తెలుగు విద్యార్థులు

» యూఎస్ కాన్సులేట్ జనరల్ ఆఫీస్ పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెస్


» మల్లారెడ్డి యూనివర్సిటీలో అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభం


ఇంటర్‌నేషనల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అలెగ్జాండర్ మెక్‌లారెస్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 20 : విదేశాల్లో చదువుతున్న తెలుగు విద్యార్థులు విద్యారంగంలో ప్రతిభ చాటుతున్నారని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెస్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బుధవారం గ్లోబల్‌ట్రీ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మెక్‌లారెస్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత చదువులు చదివేవారికి దిశానిర్దేశం చేసేందుకు ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ సెంటర్‌ను సద్వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ నేడు చాలామంది తెలుగు విద్యార్థులు ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తున్నారని, వారికి విదేశీ చదువుల పట్ల పూర్తి అవగాహన కల్పించటానికి తమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. ప్రపంచానికి ఉత్తమ ఇంజినీర్లను, డాక్టర్లను అందిస్తున్న ఘనత భారతదేశానికి దక్కుతుందన్నారు. తమ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదివి స్థిరపడ్డారని అన్నారు. విదేశాలకు వెళ్లదలచిన వారు అక్కడి యూనివర్సిటీల్లో దరఖాస్తు చేసుకోవటం, వీసా తదితర అంశాల పట్ల పూర్తి అవగాహన కల్పించటంతో పాటు అన్ని పనులు తమ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ సెంటర్ ద్వారా తెలుసుకునే వీలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్లోబల్‌ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకార్ అలపాటి, సౌత్ ఏషియా, ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషన్ హెడ్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

మా బలం మోదీనే!

(ఐదో పేజీ తరువాయి)



బీజేపీ తలుపులు మూసివేసింది. ఇలాంటి వారిని కాంగ్రెస్ దగ్గర చేర్చుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోజు రోజుకు ఆ పార్టీ మునిగిపోతుంది. వచ్చిన ఆదాయాన్ని అంతా కాళేశ్వరంలో పోసి రాష్ట్ర ప్రజల చేతికి చిప్ప అందించారు. అప్పుల పాలైన రాష్ట్రాన్ని కాంగ్రెస్ మరింత అథోగతి పాలు చేస్తుంది. చేవెళ్లలో ఎవరైనా పోటీ చేయవచ్చు. కానీ ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ మంచి చేయకుండా ప్రజల ఆస్తులను కొల్లగొడితే చూస్తూ ఊరుకోవడం మంచిది కాదు. మంచేదో చెడేదో ప్రజలే నిర్ణయిస్తారు.

వికారాబాద్ దశ, దిశ మారుస్తా

చేవెళ్ల పార్లమెంట్ నుంచి నన్ను గెలిపిస్తే పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తా. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు బీజాపూర్ హైవే విస్తరణ పనులకు దాదాపు రూ. వేయి కోట్ల నిధులు మంజూరు నేను చేయిస్తే ఇది మేము చేశామని కొందరు అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే ఈ పనులన్నీ సత్వరమే పూర్తయ్యేలా చూస్తా. అలాగే వికారాబాద్‌కు రోడ్డు, రైలు కనెక్టవిటీ పెంచడం ద్వారా శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తాం. గతంలో కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి వికారాబాద్‌ను శాటిలైట్ టౌన్‌షిప్‌గా చేసేందుకు కేంద్రం నుంచి కొన్ని నిధులు మంజూరు చేయించారు. ఇది చాలా మంచిపనే. కానీ రవాణా కనెక్టివిటీ పెంచకుండా దీన్ని అభివృద్ధి చేయడం సాధ్యం కాదు. నన్ను ఈ ప్రాంత ప్రజలు గెలిపిస్తే మన్నెగూడ వరకు హైవే విస్తరణ పనులు పూర్తిచేస్తాం. అలాగే హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు ఎంఎంటీఎస్‌ను విస్తరించేందుకు కృషి చేస్తాను. హైదరాబాద్ ముంబై బుల్లెట్ రైలు కోసం సర్వే కూడా పూర్తయింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే వికారాబాద్ దశ తిరుగుతుంది. కేవలం 20 నిమిషాల్లో హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు చేరుకోవచ్చు. అలాగే రీజినల్ రింగురోడ్డు కూడా వికారాబాద్ సమీపం నుంచి వెళ్లనుండడంతో ఈ ప్రాంత అభివృద్ధికి ఇది మరింత దోహదమవుతుంది. నియోజకవర్గంలో రైతుల కోసం మెట్ట రైతుల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసే యత్నం చేస్తాను. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తాం. ఉద్యాన పంటలు పండించే రైతుల కోసం మూడు ప్రణాళికలు సిద్ధం చేశాం. డిమాండ్ ఉన్న సమయంలో పంట వచ్చేవిధంగా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు మార్కెటింగ్, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు కృషి చేస్తాను. తాండూరులో నాపరాతి పరిశ్రమ అభివృదికి కృషి చేస్తా. ఇక్కడ నాపరాతి ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని ఒప్పిస్తాను. దీనివల్ల తాండూరు నాపరాతి విలువ కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత పెరుగుతుంది. హైదరాబాద్ శివార్లతో పాటు మారుమూల గ్రామాల్లో కమ్యూనిటీ స్కూళ్ల నిర్మాణాలు చేపతాం. వీటికి ప్రభుత్వమే నిధులు ఇచ్చినా స్థానిక ప్రజలే ఈ స్కూళ్లను నడిపే విధంగా వీటిని తీర్చిదిద్దుతాం. అలాగే ప్రతీ గ్రామంలో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు చేయిస్తాను. ఇప్పటికే ప్రయోగాత్మకంగా 10 గ్రామాల్లో అమలు చేస్తున్నాం.

కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఇక జనం నమ్మరు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీ- బీఆర్ఎస్ ఒక్కటేనని వారి మధ్య అవగాహన ఉందని తప్పుడు ప్రచారం చేసి డ్యామేజీ చేసింది. దీన్ని కొంతమంది ప్రజలు నమ్మడంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. వాస్తవానికి గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పై అభిమానంతో ప్రజలు ఓట్లు వేయలేదు. కేసీఆర్ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌కు వెళ్లింది. వారు చేసిన తప్పుడు ప్రచారం కూడా మాకు నష్టం కలిగించింది. ఇపుడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. కవిత అరెస్ట్‌తో బీఆర్ఎస్‌కు మాకు ఎలాంటి అవగాహన లేదనేది స్పష్టమైంది. ప్రజలకు వాస్తవం తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఇపుడు కాంగ్రెస్‌కు ఓటేసిన వారితో పాటు బీఆర్ఎస్‌కు ఓటేసిన వాళ్లు కూడా బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధమయ్యారు.


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యుడు

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కో ఆపరేటివ్ సొసైటీ : ఎస్పీ

వికారాబాద్, మార్చి 20 : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లాలో కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో కోఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించారు. సొసైటీ ద్వారా చేసిన వార్షిక కార్యక్రమాలు.. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి.. సభ్యులకు అందాల్సిన బెనిఫిట్స్, వెల్ఫేర్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎవరైనా మరణించినా, రిటైర్మెంట్ సమయంలో, పోలీస్ సిబ్బంది పిల్లల ఉన్నత చదువుల కొరకు ప్రతీ సంవత్సరం మెరిట్ స్కాలర్ షిప్‌లు కోఆపరేటివ్ సొసైటీ తరఫున ఆర్థిక చేయూతనందించాలన్నారు. భవిష్యత్తులో సొసైటీ ద్వారా చేపట్టాల్సిన పనులను బాడీ మెంబర్స్ అందరూ కలిసి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీస్ తరఫున ఎల్లప్పుడూ ముందుంటామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ సీఐ రాజు, వెంకటేశం, పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాలా కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నవాబుపేట, మార్చి 20 : నాలా కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నవాబుపేట మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్ అనితా రంగారెడ్డి గ్రామస్తులతో కలిసి బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్లు 402, 403లో గల ప్రభుత్వ నాలా కబ్జాకు గురవుతుందన్నారు. కాగా, సమీపంలోని 200 ఎకరాల ప్రభుత్వ భూమి గల గుట్టపై నుంచి వచ్చే వర్షపు నీరు నాలా ద్వారా బయటకు వెళుతుందని, హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త కబ్జా చేస్తుండటంతో గ్రామస్తులు ప్రశ్నించగా.. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి నాలా కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కబ్జాకు గురవుతున్న నాలా


భరత్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు


కేంద్రంలో మరోసారి బీజేపీదే అధికారం

కల్వకుర్తి, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుపొంది మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. బీజేపీ ప్రజాభిమానం ముందు స్వార్థ శక్తుల కుట్రలు ఫలించవని వారు చెప్పారు. కడ్తాల మండలంలో బుధవారం వారు పర్యటించారు. వారికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ఈ సందర్భంగా రాములు, భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ ఎదురు లేని శక్తిగా తయారైందన్నారు. ప్రధాని మోదీ పాలనా దక్షతతో పదేళ్లలో భారత్ అద్భుత విజయాలు సాధించి ప్రపంచ దేశాల్లో కీర్తి ప్రతిష్ఠలు పొందిందన్నారు. మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూడూరు గోపాల్ రెడ్డి, రమేష్, వీరయ్య, మన్యనాయక్, రవిరాథోడ్, పాల్గొన్నారు.

డీహెచ్ఎం 117 మొక్కజొన్న విత్తనాలతో అధిక దిగుబడి

» మొక్కజొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నగేష్‌కుమార్

» ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు

కొందుర్గు, మార్చి, 20 : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లో భాగంగా ఒక గ్రామంలో 70 శాతం ఎస్సీ రైతులు ఉన్న గ్రామానికి డీహెచ్ఎం 117 మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఆ విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని భైరంపల్లికి చెందిన రైతు భాస్కర్ పొలంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మొక్కజొన్న క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీహెచ్ఎం 117 మొక్కజొన్న విత్తనాల కోసం భైరంపల్లిని ఎన్నిక చేశామని తెలిపారు. గ్రామంలోని 25మంది ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి 8 కిలోల విత్తనాలను ఉచితంగా అందించామని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లయ్య, డాక్టర్ సునీత, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ పరమేశ్వరి, మండల వ్యవసాయాధికారి మధుసూదన్, ఏఈవోలు వాసవి, లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ

» ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి



షాద్‌నగర్‌అర్బన్, మార్చి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనతో రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతోందని మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లోని వీ కన్వెన్షన్ హాలులో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే షాద్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, బీఆర్ఎస్ నాయకులు పులిమామిడి శ్రీశైలంగౌడ్, నడికూడ యాదగిరియాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మన్నె జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేరుస్తూ, ప్రజల మన్ననలను పొందుతున్నారని అన్నారు. అధికారం చేపట్టగానే ప్రగతి భవన్‌కు ఉన్న ఇనుప కంచెను బద్దలు కొట్టి, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, జడ్పీటీసీలు పి. వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయిస్తున్న మోదీ ప్రభుత్వం

» చేవెళ్లలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం : సబితా ఇంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్/ శంషాబాద్, మార్చి 20 : కేసీఆర్‌ని నేరుగా ఎదుర్కొనే సత్తా లేకనే మోదీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తూ.. అక్రమ కేసులు బనాయిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. శంషాబాద్‌లోని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో పదేళ్లు పాలించిన బీజేపీ, రాష్ట్రంలో మూడు నెలల్లోనే ప్రజల్లో నమ్మకం కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నల్లధనం తెచ్చి, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఉన్న ఉద్యోగాలు లేకుండా మోదీ చేశారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి : ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీలు సురభివాణిదేవి, దయనంద్ గుప్తా, ఎమ్మెల్యేలు ఆరెకపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి, బడుగు, బలహీన వర్గాల ప్రతినిధి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తుందని, ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపిస్తామన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని, ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

ఆమనగల్లు , మార్చి 20 : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతీ ఒక్కరు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పార్వతి సూచించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గురించి బాలింతలు, తల్లులు గర్భిణీ స్త్రీలు, కిశోర బాలికలకు అంగన్‌వాడీ టీచర్లు వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఆయాలు పాల్గొన్నారు.

మల్లు రవికి ఘనస్వాగతం



మల్లు రవిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 20 : ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవికి కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు ఆధ్వర్యంలో నాయకులు అక్కడికి చేరుకుని మల్లు రవికి స్వాగతం పలికి సత్కరించారు. ర్యాలీగా నగరంలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఖాదర్‌ఖాద్రి, రవీందర్‌నాయక్, సుధాకర్, డేవిడ్, రమేశ్, శ్రీను, పాల్గొన్నారు.

ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యాచారం, మార్చి 20 : ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు అంకిత బావంతో పని చేయాలని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఇటీవల ఎస్‌యూఎఫ్ఐ చైర్మన్‌గా ఎన్నికైన ఆయనను బుధవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ యాచారం మండల నాయకులు ఘనంగా సత్కరించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఎండీ అక్బర్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పరికుప్పల తిరుమలేష్, నాయకులు సుధాకర్, మల్లేష్, దెండి రాంనాథ్‌రెడ్డి, గులాం సందాని తదితరులున్నారు.

దైవ కార్యక్రమాలు సన్మార్గానికి దోహదం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయినాథ్‌రెడ్డి

ఆమనగల్లు , మార్చి 20 : దైవ కార్యక్రమాలు మానవాళి సన్మార్గ పురోగమనానికి దోహద పడుతాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునని ఆయన చెప్పారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన కసిరెడ్డి సాయినాథ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం, మార్చి 20 : తుక్కుగూడ మున్సిపాలిటీలోని శ్రీనగర్ గ్రామంలోని ఆదిలక్ష్మి అలువేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి. వీరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం కల్యాణోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నేటి నుంచి 24 వరకు జరిగే ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు శేషం జగన్నాధచార్యులు, సింహాచా ర్యులు, మంఖాల్ మాజీ సర్పంచ్ ఆర్. మదన్‌మోహన్‌గుప్త, తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మదుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని సంక్షేమ బాటలో నడిపిస్తున్న మోదీ



హరిభూషన్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 20 : దేశాన్ని ప్రగతి, సంక్షేమ బాటలో ప్రధాని నరేంద్రమోదీ నడిపిస్తున్నారని బీజేపీ షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు హరిభూషన్ అన్నారు. పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. దేశం కోసం ఆర్మీలో పనిచేసిన తాను, బీజేపీ పటిష్ఠత కోసం అదే క్రమశిక్షణతో పనిచేస్తానని హరిభూషన్ చెప్పారు. ఎం. మురళీ, చెట్ల వెంకటేష్, ప్యాట ఆశోక్, సాయిగౌడ్, జి. శివశంకర్, పూసల శ్రవణ్, ఎం. విజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు/తలకొండపల్లి/కొందుర్గు, మార్చి 20 : ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంకగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో అశ్వ వాహనసేవ, హోమం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. నర్సింహ, రామ్మోహన్, చంద్రశేఖర్, దేవేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ తండాలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి స్థానిక మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్ చేయూతనిచ్చారు. బుధవారం ఆలయ నిర్వాకులకు రూ.50 వేలు విరాళం అందజేశారు. మల్లేశ్‌నాయక్‌ను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. మాజీ సర్పంచ్ అంబర్‌సింగ్, శంకర్, మణిపాల్, రమేశ్, పాల్గొన్నారు.

30 నుంచి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ఆమనగల్లులో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఈనెల 30 నుంచి నిర్వహించబోతున్నారు. వేడుకలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వేడుకలకు సంబంధించి బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు వీరేశ్‌గౌడ్, శ్రీను, తిరుపతయ్యగౌడ్, బాలస్వామి గౌడ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా హనుమ వాహనసేవ

తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కల్కిదోన గుట్టపై గల శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమ వాహన సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సిద్ధాంతి పట్టాభిరామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గంగన్నగూడలో నూతన రామాలయం ప్రారంభోత్సవం, నాభిశిల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీ నాయకులు ఎన్ శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, కమ్మరి భూపాలాచారి పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠాపన వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పిటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు

ఆమనగల్లు , మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ కనుమరుగవడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హామీల అమలు, ప్రజా పాలన ద్వారా కాంగ్రెస్ ప్రజలకు మరింత చేరువైందని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు మల్యేడి బన్సిలాల్ తన అనుచరులతో బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించి కేంద్రంలో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ తిరుగు లేని శక్తిగా తయారైందని, ఎన్ని స్వార్థ



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

శక్తులు ఏకమైనా తమను ఢీ కొనలేవన్నారు. కాంగ్రెస్ ప్రజారంజక పాలన చూసి వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, పబ్బతి శ్రీను, సురేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు పటిష్ఠ భద్రత

కడ్తాల్, మార్చి 20: శాంతియుత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి చెప్పారు. సజావుగా ఎన్నికల నిర్వాహణకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికల నేపథ్యంలో కడ్తాల టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బుధవారం అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్‌తో కలిసి డీసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ



వాహనాలను తనిఖీ చేస్తున్న డీసీపీ

రవాణను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు, రూ.50 వేలకు మించి డబ్బు తరలిస్తే సీజ్ చేస్తామని చెప్పారు. కడ్తాల, ఆమనగల్లు సీఐలు శివప్రసాద్, ప్రమోద్‌కుమార్, ఎస్సైలు వరప్రసాద్, బాల్‌రామ్‌నాయక్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు

చేవెళ్ల, మార్చి 20 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బంది రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని చేవెళ్ల ఎంపీపీ మాల్గారి విజయలక్ష్మి ప్రత్యేకాధికారులను ఆదేశించారు. బుధవారం చేవెళ్ల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎంపీటీసీలు అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి ఎండలు ప్రారంభంలోనే తాగునీటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకాధికారులు, మిషన్ భగీరథ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు చేయడంలో ప్రత్యేకాధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. మండలంలో ధరణి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ధరణి పోర్టల్



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు చెప్పారు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. మొక్కుబడిగా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో చేవెళ్ల వైఎస్ ఎంపీపీ శివప్రసాద్, ఎంపీడీవో హిమబిందు, సీడీపీవో శోభరాణి, ఎంఈవో అక్బర్, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో పెట్రోల్‌కు బదులు రంగునీళ్లు

చేవెళ్ల, మార్చి 20 : ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చేవెళ్లలో కల్తీ పెట్రోల్‌తో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం చేవెళ్ల గ్రామానికి చెందిన వడ్ల శేఖర్‌చారి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వండ్రంగి పని చేస్తున్నాడు. తన బైక్‌పై గొల్లపల్లి గ్రామానికి వెళ్లగా బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దీంతో వెంటనే మరోబైక్‌పై చేవెళ్ల మండల కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనే ఉన్న ఇండియాన్ పెట్రోల్ బంక్‌కు వచ్చి ప్లాస్టిక్ బాటిల్‌లో రూ.100 పెట్రోల్ పోయించుకుని వెళ్లి తన బైక్‌లో పోయగా బైక్ స్టార్ట్ కాలేదు. దీంతో అనుమానం వచ్చి మరో ప్లాస్టిక్ డబ్బాలో పెట్రోల్ పోయించుకుని చూస్తే రంగునీళ్ల మాదరిగా కనిపిచింది. ఇదేంటని బంకులో పని చేస్తున్న సిబ్బందిని ప్రశ్నిస్తే వాళ్లు నీళ్ల నలిమాలారు. దీంతో పలు



కల్తీ పెట్రోల్‌తో బాధితుడు

వురు వాహనదారులు అక్కడికి చేరుకుని బంకు నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు, కెమికల్స్ కలిపిన మాదిరిగా పెట్రోల్ ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రంలోని బంకుల్లో కల్తీ పెట్రోల్ అమ్ముతూ పలువురు వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కల్తీ పెట్రోల్‌తో తరుచూ తమ వాహనాలు రిపేర్‌కు వస్తుయాని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్తీ పెట్రోల్ అమ్ముతున్న బంకుల్లో తనిఖీలు నిర్వహించి ఇలాంటి ఘటనలు పునరావృతం రారేండా యాజమనులపై చర్యలు తీసుకోవాలని చేవెళ్ల మండలంలోని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో భాదితుడు వండ్ల శేఖర్‌చారి జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు.

సంక్షిప్తంగా..

● **షాబాద్, మార్చి 20 :** కాంగ్రెస్‌తోనే రైతులకు సరైన న్యాయం జరుగుతొందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సబ్బరి గారి రాజు అన్నారు. షాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు పెట్టుబడి సాయం, పంటల బీమా పథకం, రైతులకు సలహాలు, సైచనలకు రైతు నేస్తం, రాష్ట్రంలో రైతు కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం, ధరణి పోర్టల్ ప్రక్షాలనకు చర్యలు, త్వరలోనే కౌలు రైతుల రక్షణ చట్టంలాంటివి తీసుకువస్తోందన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే కాలయాపన చేసిందన్నారు.ప్రభుత్వం త్వరలోనే రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తుదన్నారు.

● **ఆమనగల్లు :** మాజీ మంత్రి , మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ను బుధవారం ఆమనగల్లు మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎర్రవోలు శ్రీను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిదంగా ముదిరాజ్ లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. ఈటలను కలిసిన వారిలో నాయకులు మహేశ్ గౌడ్, వరికుప్పల వెంకటేశ్, అనిల్ రెడ్డి, మహేశ్‌యాదవ్ ఉన్నారు.

● **మాడ్గుల :** మండలంలోని నల్లచెర్వు గ్రామానికి చెందిన కట్ట సతీష్ అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం నల్లచెర్వు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు లిక్కి హరీష్‌రెడ్డి, కల్లు దర్పాన్‌రెడ్డి, వెంకటయ్య బుధవారం బాధితుడిని పరామర్శించి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10000 అతని కుటుంబ సభ్యులకు వారు అందచేశారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని వినతి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

కొత్తూర్, మార్చి 20 : మున్సిపాలిటీ పరిధి రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ ఇంటిపై ఏర్పాటు చేయబోతున్న సెల్‌టవర్ ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని అంబేద్కర్ కాలనీవాసులు బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలాజీకి ఫిర్యాదు చేశారు. ఇళ్ల సమీపంలో సెల్‌టవర్ నిర్మిస్తున్నారని, దాంతో రేడియషన్ కారణంగా ప్రజలు అనారోగ్యం భారిన పడే అవకాశం ఉందని, తక్షణమే నిర్మాణం పనులు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు కర్రోళ్ల లక్ష్మయ్య, శంకర్, గణేష్, రంజిత్, అనిల్, విక్రమ్, అశోక్, శ్రీను, రమేష్, చింటూ ఉన్నారు.

బీజేపీ అభ్యర్థులు గెలవాలని పూజలు

చేవెళ్ల, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతు అయోధ్యలోని రామలయంలో బాల రామునికి చేవెళ్ల మండల బీజేపీ ఉపాధ్యక్షుడు జి. కృష్ణగౌడ్, కృష్ణమోహన్ తోపాటు పలువురు నాయకులు బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేయించారు. దీంతో పాటు మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటెల రాజేందర్ పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని బాలరాముని దర్శించుకుని పూజలు చేయించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో మరోమారు నరేంద్రమోడీ ప్రధాని అవుతారని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశ్, బీజేపీ నాయకులు కన్నయ్య ఉన్నారు.

ప్రైవేటు వ్యక్తుల పేరిట ఉన్న శిలాఫలకాన్ని తొలగించాలి

కందుకూరు,మార్చి 20 : మండలంలోని కొత్తగూడ గ్రామంలో ఇటీవల నిర్మించిన వైకుంఠదామం గోడపై ప్రవేటువ్యక్తుల పేరుతో ఉన్న శిలాఫలకాన్ని వెంటనే తొలగించాలని ఆ గ్రామస్థులు బుధవారం ఎండీవో బి.సరితకు మహేశ్వరం మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, నాయకులు తల్లోజు మాధవచారి, ఎండి ఖదీర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడ గ్రామంలో వైకుంఠదామం నిర్మించిందిని, కానీ సర్పంచ్‌ల పాలన ముగిశాక మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి వైకుంఠదాయం నిర్మానానికి తన సొంత ఖర్చుతో నిధులు వెచ్చించినట్లు వైకుంఠదామం గోడపై ఆయన తాత ఎల్లారెడ్డి, నానమ్మ వెంకటమ్మ పేరిట శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన వైకుంఠదామానికి ప్రవేటు వ్యక్తుల పేర్లు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై వారం క్రితం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా శిలాఫలకంపై పేర్లు పెట్టిన వారిపై చర్యలు తీసుకొని, వాటిని తొలగించాలని చెప్పారు.

గురుకుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, మార్చి 20 : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023-2024 విద్యాసం వత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించే ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు) శంకర్‌పల్లి ప్రిన్సిపాల్ జయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 చివరి తేదీ అని ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21న నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకోసం tswries.in వైబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బీజేపీతోనే ఓబీసీల సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరప్ప

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తేనే ఓబీసీల సంక్షేమం సాధ్యమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. షాద్‌నగర్‌లోని ఏబి కాంప్లెక్స్‌లో బుధవారం బీజేపీ ఓబీసీ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఈశ్వరప్ప మాట్లాడుతూ దేశంలోని 18 కుల వృత్తుల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. భారత దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ, పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రధాని నరేంద్రమోదీకి ప్రతి ఒక్కరు అండగా ఉండాలన్నారు. బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డీకే అరుణను అఖండ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు కరణ్, మురళీ, వంశీకృష్ణ, హరిభూషణ్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారులో మంటలు.. తృటిలోతప్పిన ప్రమాదం



కాలిపోతున్న కారు

ఆమనగల్లు, మార్చి 20 : ఆమనగల్లు పట్టణంలోని ఆదర్శ నగర్ కాలనీలో ఓ కారు దగ్ధం కాగా తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. ఆదర్శనగర్ కాలనీకి చెందిన ఎస్.టీ కాశీనాథ్ నివాసంలో బుధవారం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ఆయన బంధువు శశికుమార్ కుటుంబ సభ్యులతో ఐటెన్ కారులో వచ్చారు. మధ్యాహ్నం ఎండ ఎక్కువ కావడంతో ఇంటి బయట పార్కింగ్ చేసిన ఆ కారును పక్కకు తీసే క్రమంలో దాని కింద భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న వారు గమనించి డ్రైవింగ్ సీట్‌లో ఉన్న శశికుమార్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే కిందికి దిగడం వల్ల ప్రమాదం తప్పింది. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ సకాలంలో రాకపోవడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్సై బాల్‌రామ్‌నాయక్ సందర్శించి వివరాలు సేకరించారు.

విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు

యాచారం, మార్చి 20 : విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించి వారి విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై మంగళవారం రాత్రి యాచారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన పందుల సూరిగౌడ్(25), పందుల బుచ్చయ్య గౌడ్(35), పందుల రామలింగంగౌడ్(42) యాచారం మండలంలోని మాల్‌లో మంగళవారం రాత్రి పది గంటల సమయంలో దేవరకొండ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ వెళుతుండగా ఎక్కారు. వారిని టికెట్ తీసుకోవాలని కండక్టర్ కోరడంతో వారు టికెట్ తీసుకోకపోగా కండక్టర్, డ్రైవర్లను దూషించారు. దాంతో డ్రైవర్ యాచారం పోలీస్‌స్టేషన్ ముందు బస్సును ఆపి కండక్టర్, డ్రైవర్‌ను ఆ ముగ్గురు దూశించారని పోలీసులకు చెప్పారు. ఆ ముగ్గురిని పోలీసులు వివరణ కోరగా వారు స్టేషన్‌లోకి వెళ్లి పోలీసులతో గొడవకు దిగి ఓ కానిస్టేబుల్ చొక్కా పట్టి, దురుసుగా ప్రవర్తించి అసభ్యపదజాలంతో పోలీసులను దూషించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. పోలీసులను దూషించరాదని వారికి సర్ది చెబుతున్నా మా సంగతి మీకేం తెలుసునని ఘర్షణకు దిగారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు పంపగా, రామలింగంగౌడ్ పరారు కాగా, సాయంత్రం అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.

చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల, మార్చి 20 : తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలోని పర్వేద గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండల పరిధిలోని పర్వేద గ్రామానికి చెందిన తోక రాములు (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది కాలంగా మద్యానికి బానిసై గ్రామంలో చిన్న చిన్న అప్పులు చేశాడు. ఆరు నెలల క్రితం అతని అత్తగారు పొలం అమ్మగా వారివద్ద నుంచి డబ్బులు తీసుకురమ్మని భార్య అనితతో గొడవపడేవాడు. ఆమె డబ్బులు తీసుకరాకపోవడంతో తమ సొంత పొలం అమ్ముదామని గొడవ పడేవాడు. అతని భార్య ఒప్పుకోకపోవడంతో ఆమెతో గొడవపడి బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో భార్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా అతను ఎత్తకపోవడంతో వెతుక్కుంటూ పొలం దగ్గరకు వెళ్లి చూడగా వారి సొంతపొలంలోని చింత చెట్టుకు రాములు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కాగా మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల పెళ్లికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

చేవెళ్ల, మార్చి 20 : బంధువుల పెళ్లికి వెళుతున్నాను అని చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అజిలాపూర్ గ్రామానికి చెందిన కేశమోని రాజు(28) అదే గ్రామానికి చెందిన మీనాను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. బతుకుదెరువు కోసం చేవెళ్లకు వచ్చి జీవనం సాగిస్తున్నాడు. రాజు డ్రైవింగ్ చేస్తుండగా, అతని భార్య మీనా పూలు అమ్ముతూ జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 17న బంధువుల వివాహం ఉందని అక్కడకు వెళ్లి తిరిగి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి డబ్బులు తీసుకుని రాజు వెళ్లిపోయాడు. మూడు రోజులు గడుస్తున్నా ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య మీనా చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. రాజు ఇంటి నుంచి వెళ్లేటప్పుడు బ్లూ టీషర్ట్, ప్యారట్ గ్రీన్ ప్యాంట్ వేసుకుని వెళ్లాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్, మార్చి 20 : ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ వెంకట్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, రైతు సమన్వయ కమిటీ గ్రామ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మయ్యయాదవ్, చంద్రారెడ్డి, అంజిరెడ్డి, సత్తయ్యగౌడ్, లింగమయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

కంకరతేలిన రోడ్డు.. ప్రయాణికుల ఇబ్బందులు



కంకరతేలిన రోడ్డు

మాడ్గుల, మార్చి 20 : మాడ్గుల మండలంలోని కలకొండ గ్రామం నుంచి తోడేలు గుండు తండా వరకు 3కిలో మీటర్ల దూరం వరకు గల బీటీరోడ్డు కంకర తేలడంతో ప్రయాణీకుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రయాణం నిత్య నరకంగా మారిందని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాయణం చేయవలసి వస్తోందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. ఈ బీటీ రోడ్డు వేసిన నాణ్యత లేకపోవడం వల్ల గుంతలుగా మారిందని తండావాసులు చెప్పారు. నాలుగేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు కాంట్రాక్టర్, అధికారుల అలసత్వంతో నాణ్యతలేని పనులు చేపట్టారని తండావాసులు ఆరోపించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు బీటీరోడ్డును వెంటనే మరమ్మతు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.